కథానిక

మిత్రద్రోహి

శ్రీ వి సచ్చిదానంద శర్మ

ఉదయం వీధి అరుగుమీద కూర్చుని పళ్ళు తోముతున్నవాణ్ణి, పరసని తీరిగ్గా మొహం కడుగుతున్నవాణ్ణి కాస్తా పుల్ల అవతల పారేసి, పురిసెడు నీళ్లు పుక్కిలించి రోడ్డుని పడ్డాను. బుఱ్ఱంతా ఒక్కసారి ఖాళీ అయిపోయిన ట్లనిపించింది; కొద్ది క్షణాలవరకూ నే నేం చేస్తున్నానో నాకే తెలీక పోయింది. అప్పటి నా పరిస్థితినిగురించి ఆలోచిస్తుంటే - నిజంగా నే నానాడు శంకరశాస్త్రి చావునిగురించి అంత విచారించాల్సింది లేదేమో ననిపిస్తోంది. కాని, అప్పుడు తరవాత కొన్ని రోజులవరకుకూడా ఆ విషయాన్ని మరిచిపోలేక పోయానంటే- శంకరశాస్త్రి నాకు ఆప్తుడు కాకపోయినప్పటికీ, ఆప్తుణ్ణి చేసుకోవా లని అన్నాళ్లూ ఉవ్విళ్లూరటమే కారణమయుండాలి. ఇక నలాంటి అవకాశం శాశ్వతంగా లేకుండా హఠాత్తుగా చనిపోయేసరికి నిజంగానే చాలా విచారించాను.

వీధి మలుపు తిరిగేసరికి వచ్చే జనం, పోయే జనం గల్లంతుగా వున్నారు. కాని, ఏడుపులు, పెడబొబ్బలుమాత్రం ఏమీ లేవు సామాన్యుల ఇళ్లల్లో అయితే అలాంటి హంగామా అంతా వుంటుందికాని, శంకరశాస్త్రివంటి నాగరికుని ఇంట్లో ఏడుపు బయటి కెందుకు వినిపిస్తుంది? వచ్చే, పోయేవాళ్ల ముఖకవళికల్నిబట్టి త్వర త్వరగా ముందుకి అడుగువేశాను. చివరిచూపులు కూడా అందవని ఇందాకనే గ్రహించాను. లోపలజనం చాలామంది మూగి వున్నారు. చిన్న చిన్న ఏడుపులుకూడా వినబడుతున్నై. జనాన్ని నెట్టుకుంటూ ముందుకి వెళ్లి గబగబా మేడమెట్లు ఎక్కాను. జనమంతా శంకరశాస్త్రి పడకగదిలోనుంచి వస్తుండేసరికి లోపలికి అడుగు పెట్టాను.

అంత నెత్తురు కక్కుకు నిమంచంమీద పడున్న శంకరశాస్త్రిశవాన్ని చూచేసరికి హఠాత్తుగా ఈ వార్త ఎందుకు వినాల్సివచ్చిందో గ్రహించాను. దిండంతా పరుపు కొంత మేర - చెరువంత రక్తం మరకఅయి వుంది. అందులోనే బోర్లబడి శంకరశాస్త్రిశవం ఉంది. ఆ దృశ్యం చూచేసరికి ఒక్కసారి ఒళ్లు గగుర్పొడిచింది. ఇంతలో ఎవరో దుప్పటి తీసుకొచ్చి శవంపైన కప్పారు. ఇది సామాన్యమైన చావు కాదనీ, కాకపోతే అంత హఠాత్తుగా మరణించ డనీ గుసగుసలు ప్రారంభించారు. నిజానికి, శంకరశాస్త్రి రక్తం కక్కుకుని చచ్చిపోయినట్లుంది. కాని, వంటిమీద దెబ్బ లేమీ లేవు దానికితోడు ఈమధ్య శంకరశాస్త్రి దగ్గుతో బాధపడుతున్నాడని కూడా చాలామంది బలపరిచారు. ఈ తర్జన భర్జన రోడ్డుపొడుగునా సాగుతూ వచ్చింది వచ్చేపోయే జనంలో. ఇదంతా చివరికి దేనికింద తేలుతుందోనని నాలో నాకే చాలా భయంగా వుంది.

వెంకటేశ్వర్లు అక్కడెక్కడన్నా కనిపిస్తాడేమోనని చూశాను. కాని, అతని జాడెక్కడా కనిపించలేదు. నే నెరుగున్నప్పటినుంచీ శంకరశాస్త్రి నీడలాగా మెలుగుతూ వచ్చిన వెంకటేశ్వర్లు ఇలాంటి ఆపత్సమయంలో అక్కడ లే డంటే చాలా ఆశ్చర్యపోయాను. వాళ్లిద్దరి స్నేహం ఈనాటిది కాదు. నా కళ్లముందు అనేకమంది స్నేహితులమంటూ పూసుకు, పూసుకు తిరిగి - రెండోరోజుకల్లా ఈ జన్మలో కలియటానికి వీలులేనంత ఎడమొహాలూ, పెడమొహాలూగా మారటం నే నెరుగుదును. అలాంటప్పుడు శంకరశాస్త్రి, వెంకటేశ్వర్లు స్నేహం చూస్తుంటే నా కెందుకో ముచ్చటవేసేది వాళ్ల స్నేహం ఈ జన్మలో ఏర్పడింది మాత్రమే కాదనీ, చాలా పూర్వజన్మలనుంచీ ఇలాగే ఉండివుంటారనీ అనుకున్నాను.

శంకరశాస్త్రితో స్నేహం చెయ్యాలని నేనూ చాలాసార్లు ప్రయత్నించాను ఆ రోజుల్లో అతను నాకు అత్యంతస్నేహపాత్రుడుగా కనబడేవాడు. వెంకటేశ్వర్లు అతనితో స్నేహం నిలుపుకోవటానికి ఆచరిస్తున్న పనులన్నీ నేను కూడా ఆచరించటానికి ప్రయత్నించేవాణ్ణి. కాని, అంతమాత్రంచేత అతనికి వెంకటేశ్వర్లంత స్నేహితుణ్ణి ఎప్పుడూ కాలేకపోయాను. పైగా, అతనిముందు నా చర్యలన్నీ ఏదో ఎరువు తెచ్చుకున్నట్లు నాకే కనబడేవి. కాని, కొన్నాళ్లకి అతనితో స్నేహం కలవటం అసంభవం; ఒకవేళ ఏనాటికైనా వీలున్నా - ఇదికాదు మార్గం అనుకున్నాను. నిరాశతో వాళ్లిద్దరినీ మాత్రం చూస్తూ ఉండేవాణ్ణి.

వాళ్ళతో నాకు స్నేహం ఏర్పడలేదని శంకరశాస్త్రిమీద, ముఖ్యంగా వెంకటేశ్వర్లు మీద నాకు ఈర్ష్య లేదని నేననను: శంకరశాస్త్రి మనస్సులో నే నాక్రమించాలనుకునేది,అప్పుడు వెంకటేశ్వర్లు ఆక్రమిస్తున్న స్థానం అవటంవల్ల వెంకటేశ్వర్లు నాకు ప్రత్యర్థిగా కనబడేవాడు. దానికితోడు వెంకటేశ్వర్లు వీలు దొరికినప్పుడల్లా శంకరశాస్త్రితో తన కున్న పూర్వపరిచయాన్ని వినియోగించి నన్ను అతని దగ్గరనుంచి ఒక మెట్టు దిగజారదీస్తూ ఉండేవాడు. ఇదంతా గమనించిన నాకు శంకరశాస్త్రితో స్నేహం చెయ్యాలన్న కోర్కెకూడా క్రమంగా సన్నగిలింది. వెంకటేశ్వర్లుమీద అసహ్యం మాత్రం నాలో గట్టిగా నిలిచిపోయింది. అతని ప్రతి చర్యలోనూ, ఒకవిధమైన వెకిలితనం; స్వార్థం కనిపెట్టాను.

నిజం చెప్పాలంటే శంకరశాస్త్రికి, వెంకటేశ్వర్లుకి ఉన్న సంబంధం స్నేహం కాదు; వెంకటేశ్వర్లు శంకరశాస్త్రిభృత్యుడు. అన్నీ ఉన్న శంకరశాస్త్రి స్నేహం చెయ్యాలంటే వెంకటేశ్వర్లే కావాలేమిటి? తన ఛాయాలోవాళ్లే కావలసినంతమంది ఉన్నారు ఎదురుచూస్తూ. అసలు శంకరశాస్త్రి వెంకటేశ్వర్లు నెప్పుడూ స్నేహితుడిగా చూడలేదు. అతన్ని పనివాణ్ణిలాగా మందలిస్తూ ఉండేవాడు. ఇది నేను అనేకసార్లు గమనించి అసహ్యించుకున్నాను. అవన్నీ గుట్టుచప్పుడు కాకుండా మింగి ఊరుకుని, అంత బ్రహ్మాండమైన హోదాని నే నెక్కడ లాక్కుపోతానోనని నన్ను దగ్గిరికి చేరనిచ్చేవాడు కాదు. శంకరశాస్త్రివెంట అలా తోక ఆడించుకుంటూ కుక్కలాగా వెంకటేశ్వర్లు తిరుగుతుంటే నేను తరవాత తరవాత అనేకసార్లు అసహ్యించుకున్నాను. వెంకటేశ్వర్లు అతనిదగ్గిర పడిగాపులుపడటం చూస్తుంటే నేను వాళ్ల స్నేహితుణ్ణి కాకపోతి నన్న విచారం ఏమాత్రం లేకుండా పోయింది.

శంకరశాస్త్రి చనిపోయిన తరవాత వెంకటేశ్వరు నా కెందుకో ఆప్తుడుగా కనబడడం మొదలు పెట్టాడు. శంకరశాస్త్రిమరణానికి మే మిద్దరం సమానంగా విచారపడవలసినవాళ్ల మనిపించింది నాకు. దానికి తోడు, వెంకటేశ్వర్లు ఊళ్లో లేడన్నారు. అతనాక్షణాన అక్కడుంటే ఎంత విచారించేవాడో నేను తేలిగ్గానే ఊహించుకోగలిగాను. మిత్రుడికోసం తన వ్యక్తిత్వాన్నికూడా అవసరమైతే ఒదులుకుంటూ వచ్చిన వెంకటేశ్వర్లు ఈ దుర్వార్త వింటే... అత నుండబోయే స్థితి తల్చుకునేసరికి భయంవేసినది నాకు.

ఈ వార్త వెంకటేశ్వర్లుకి ముందు అందించినది నేనే. సంధ్యవేళ అలా, వాళ్లింటి మీదుగా వెడుతుంటే అప్పుడే అతనూ బయటి కొచ్చాడు. నన్ను చూచి కన్నెగరేసి పలకరించాడు. నేనూ నవ్వుతూనే లోపలికి ప్రవేశించాను. అసలు, మే మిద్దరం బయటికి గుర్తించతగ్గంతగా ఎన్నడూ మాటామాటా అనుకుని ఎరగం. అందువల్ల "ఊరు వెళ్లారుటే.." అన్నాను పరామర్శగా.

"అవునండీ...ఇందాకనే వచ్చాను" అన్నాడు తనుకూడా కూర్చుంటూ.

అతని మాటతీరునిబట్టి శంకరం చనిపోయిన విషయం ఇంకా అతనికి తెలియలేదని గ్రహించాను. ఆ విషయం బయటపెట్టటానికి ఉపోద్ఘాతం ఏమిటా అని ఆలోచిస్తున్నాను. కొంచెం సేపు నిశ్శబ్దంగా కూర్చుని అతనివైపొకసారి చూశాను.

"విన్నారా?" అన్నాను చివరికి—చాలా కలుపుగోలుతనంగా.

"ఏమిటి?" అన్నాడు ఇందాకటి ధోరణిలోనే.

"మన శంకరశాస్త్రి పోయాడు....." అన్నాను విచారం గొంతులోకి తెచ్చుకొని.

"పాపం..." అన్నాడు అతి మామూలుగా, పరాయివాళ్లు పోయారంటే మనమంతా విచారించేలాగా.

అతని తీరు చూచేసరికి నేను చెపుతున్నది శంకరశాస్త్రి విషయమని అతను సరిగా వినలేదేమో ననిపించింది. లేకపోతే నా మాటలు అంత చులకనగా తీసుకుని ఉండడు.

అందుకని "మన శంకరశాస్త్రి విషయమండీ నేను మాట్లాడుతోంది!" అన్నాను.

"విన్నాను. పాపం, రక్తం కక్కుకు చచ్చిపోయాట్ట" అన్నాడు.

ఆయన ఇంతకుపూర్వమే ఇదంతా విన్నాడని గ్రహించాను.

"పాపం, చాలా నికృష్టమైన చావు చచ్చాడండీ" అన్నాను ఏమీ మాట్లాడలేక.

"అవును" అన్నాడు వెంకటేశ్వర్లు ముక్తసరిగా.

"ఏమి టంటారు మీరు అది?" అన్నాను మళ్లీ.

"మీరే చెప్పారుగా..." అన్నాడు తర్కపండితుడిలాగా.

అతని ముఖంలోకి తేరిపారజూశాను. విషాదచ్ఛాయ లేమాత్రం లేవు. అలా చూడ్డటానికి, కనీసం అక్కడ కూర్చోటానికి నా కెందుకో కంపరంగా వుంది. ఇన్నాళ్లూ వెంకటేశ్వర్లు కపటస్నేహం నటిస్తుంటే శంకరశాస్త్రి ఒక్కసారన్నా అతన్ని అనుమానించలేదే అని విచారించాను.

"అతన్ని గురించి నాకే అలా ఉంటే, మీకెలా ఉంటుందో అనుకున్నానండీ" అన్నాను ధైర్యంచేసి.

"ఏం? నిజంగా మీరు విచారిస్తున్నారా?" అన్నాడు.

నేను తెల్లబోయాను. ఏమీ అనలేక చూస్తూ కూర్చున్నాను.

అతనే మళ్లీ సంభాషణ ప్రారంభిస్తూ, "నిజంగా నా కేమీ విచారం కలగలేదండి; కొంతవరకూ సంతోషించానేమో!" అన్నాడు.

నేను ఒక్కసారి తృళ్లిపడి వింటూ కూర్చున్నాను.

"ఇది మీకు ఆశ్చర్యం కలిగిస్తోందంటే నా పరిస్థితి మీరిన్నాళ్లూ సరిగా అర్థంచేసుకోలేదని అనుకుంటున్నాను. నిన్న రాత్రితో నా శని వదిలిపోయింది. ఇహనించీ నేను మనిషిగా బ్రతగ్గలను."

అలా తూచి, తూచి మాటలు మాట్లాడుతుంటే ఒంటరిగా అతనిముందు కూర్చుని వినటానికి నా కెందుకో భయంభయంగా వుంది.

"ఇదంతా మీకు చెప్పవలసిన అవసరం చాలా ఉంది. ఎందువల్లనంటే, మీ మనస్సుని చాలాసార్లు కష్టపెట్టిఉంటాను. అపైన మీ రేమనుకున్నా, నేనలా ఎందుకు చేశానో ఇప్పుడు మీకు చెప్పదలుచుకున్నాను."

నేనలా ఏమీ అనుకోలేదని ఆయనకి చెపుదామనుకున్నాను. కాని ఆయనధోరణి నడ్డగించటానికి ధైర్యం చాలకపోయింది. ఆయన ఒకవిధమైన ఆవేశంతో, ఉన్న విషయాలన్నీ బయటపెట్టి, తన గుండెబరువు ఒదుల్చుకోవాలని కూర్చున్న ట్లనిపించింది. అందువల్ల కనీసం కాదన్నట్లు తలకూడా తిప్పకుండా వింటూ కూర్చున్నాను.

"మనిషికి మనిషిపైన వీలు చిక్కిందంటే అధఃపాతాళానికి అణగతొక్కెయ్యటానికి సాధ్యమైనన్ని విధాలా ప్రయత్నిస్తాడు. ఏదో కాలం, ఖర్మం పనగూడి వాడు వేసిన ఉచ్చులో అవతలివాడు పడ్డాడూ అంటే, దాన్ని ఆధారంగా తీసుకుని శాశ్వతంగా వాడిపైన స్వారీ చేస్తూనే ఉంటాడు అవతలివాడు ఎంత తగ్గుతే స్వారీ మరింత ఎక్కువౌతుంది. తను శాశ్వతంగా అధికారం చలాయించటానికి, అవసరమైనప్పుడల్లా ఆ వెనక జరిగిపోయిన విషయాలు బయటికి లాగి బెదురుపెడుతూ ఉంటాడు. ఈ సుడిగుండంలోనుంచి బయటపడటం - ఇద్దరిలో ఎవరో ఒకరు అవతలికి తప్పుకుంటేనే. అలాటప్పుడు నే నెందుకు విచారపడాలి? సంతోషిస్తున్నా కూడా!"

అంత పెద్ద ఉపోద్ఘాతం వినేసరికి నా బుఱ్ఱ ఒక్కసారి దిమ్మెత్తినట్లయింది. వాళ్లిద్దరిమధ్యా ఇన్నాళ్లూ ఏదో అసాధారణమైన సంబంధం ఉన్నట్లుమాత్రం గ్రహించాను. వెంకటేశ్వర్లు మాట్లాడే ప్రతిమాటలో కృంగి, కృశించిపోయిన అతని గౌరవం, వ్యక్తిత్వం వెల్లువలుగా బయటికి వినబడుతోంది.

"శంకరశాస్త్రిదగ్గిరికి మిమ్మల్ని చేరనివ్వకపోవటానికి గల కారణం ఇప్పటికి మీకు కొంత అర్థమైందనుకుంటాను. ఉన్న విషయం చెప్పేస్తున్నాను, అతనంత దుర్మార్గుడు ఈ ప్రపంచంలో మరొకడుండడు. దగ్గరకు చేరిన మరునాటికల్లా మిమ్మల్ని బానిసకింద మార్చేస్తాడు. అంతే! ఇహ మీకు శాశ్వతంగా ముక్తి ఉండబోదు. మిమ్మల్ని కాస్తకూడా బెసిగి అవతలకి పోనియ్యడు.

"మోసపోయి అతని ఉచ్చుల్లో పడ్డనాడుకు వచ్చేటంతవరకూ నన్ను కాలికింద పెట్టి రాచేస్తూనే వున్నాడు. అసలు దుర్మార్గాన్ని ప్రేరేపించింది వాడే. అయితేనేం? నన్ను దోషిగాను, దాన్నుంచి నన్ను రక్షించగలవాడు తనుగాను పర్యవసానం తేలేట్టు చేశాడు. మంచీ, చెడు,

(17-వ పేజీ చూడుడు)

గర్భనిరోధిని

శరీరారోగ్యమునకు భంగంలేకుండ కొంత కాలమువరకు గర్భం రాకుండ ఆపుటకు ఔషధం రు. 10 లు. శాశ్వతంగా రాకుండ చేయుటకు రు 25 లు. వి. పి. చార్జీ రు 0-12-0 లు.

పుంస్త్వవర్ధని తైలం

నరములు బలహీనత చెంది సంతోష సౌఖ్యములకు దూరమై దుఃఖించువారల పాలిట వరప్రసాదిని మా నపుంసక తైలం. 1 సీసా రు 10 లు. వి. పి. చార్జీ రు 0-12-0 లు. మరియు నేపాళదేశపు కస్తూరి అంబర్, హేమం కలసి ప్రత్యేకంగా తయారుచేయబడి జగత్ప్రఖ్యాతి వహించిన తైలముగలదు. సీసా 1 కి రు 25 లు వి. పి. చార్జీ రు 1. ఆర్డర్లిచ్చువారు ముందుగా పైకం పంపుచూ జవాబుకు కబురుపంపేది.

డాక్టర్ రత్నం అండ్ సన్సు,
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్, డక్కన్.

రెండు చేసి, పై బల్లమీదే జంబుఖానా, తలగడా పరచాడు.

"మీ రిక్కడ పడుకోవచ్చునండీ - పక్క చుట్ట విప్ప అక్కర్లేదు. మూడుగోజుల ప్రయాణమా, పడుకోకతప్పదు చూడండి."

అంటూ పక్కలు పూర్తిచేసి ఎదురు బల్ల మీద కూర్చున్నాడు.

శర్మ తన పక్కమీదే బైరాయించి,"ఇప్పటి నుంచీ పడుకోం కాదండీ! ఇక్కడ కూర్చోవచ్చు రండి."

అని వెంకట్రావును పిలిచాడు.

రైలు బయలుదేరోంది.

రాఘవరావు కిటికీవైపుకు వచ్చి కూర్చున్నాడు. తక్కిన నలుగురూ, తమ పర్సులు తీసి, టిక్కెట్లు డబ్బులు లెక్కపెట్టుకొంటున్నారు.

రాఘవరావు పర్సు తీసి టిక్కెట్టు లోపల పెట్టాడు. అటూయిటూచూశాడు. ఎవరిధోరణిలో వాళ్లున్నారు. పర్సు జేబూన ఉన్న పిన్ను గప్-చిప్‌గా తీసి కిటికీలోనుంచి అవతలకు విసిరి, ఏమీ ఎరగనట్టు లోపలికి చూశాడు.

వెంకట్రావు చొక్కాలోపలి జేబుకు పిన్ను తగిలించుకుంటున్నాడు.

మిత్రద్రోహి

(11వ పేజీ తరువాయి)

కష్టం, నష్టం...అన్నిటికీ తెగించిన నేను ఆనాడు ఎలా ఉన్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను ఎదుగూబొదుగూ లేకుండా. తను మాత్రం బయట కూర్చుని, నన్ను ఎక్కేసి, ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుని అన్నివిధాలా బాగుపడ్డాడు. నిజానికి, ఆనాడు ఇద్దరం ఒకమాదిరిగానే నిరాశతో నీళ్లుకారుతూ ఉండేవాళ్లం. అలాంటి నాకు - మనం బాగుపడాలంటే దుర్మార్గం ఒకటే దారి - అని నూరిపోశాడు. దాన్ని సద్వినియోగం చేసుకున్న అతని కొనూత్రం బాగానే సరిపోయింది; నాస్థితి మాత్రం మరింత అధోగతిపాలయింది.

"ఆనాటినుంచీ అతని స్నేహితుణ్ణి కాస్తా సేవకుణ్ణి అయిఊరుకున్నాను. ఇదంతా మీరు ఎప్పుడో గమనించిఉండాల్సింది. ప్రతినిమిషం అతను నామీద అధికారం చలాయించటానికి ప్రయత్నించేవాడు. అవసరమైనప్పుడల్లా నేను దోషి నని జ్ఞాపకం చెయ్యటానికి ప్రయత్నించేవాడు. నేనుకూడా ఈమాత్రంగానన్నా నలుగురిలోనూ ఉండాలంటే అతనికి కష్టం కలగనియ్యకూడదని నా వ్యక్తిత్వాన్ని చంపుకుని అన్నిటికీ తలొగ్గిఉండేవాణ్ణి. నేనెంత తగ్గితే అతని కంత సంతోషం; ఇంకా అధికారం చలాయించటానికి అంత వీలూ అయేది రోజులు బాగుండక, చేసినదానికి అనుభవించక తప్పేదేముందని ఇన్నాళ్లూ అన్నిటికీ తలొగ్గిఉన్నాను. అలాటి మనిషిదగ్గిరికి మీరు ఒస్తుంటే చూస్తూ, చూస్తూ అతను తవ్వే గోతులో ఎలా పడనివ్వను?

"తగుమైన చావు చచ్చాడు! అసలు పురుగులు పడి చావాల్సింది! బతికినన్నాళ్లూ నా సహనం అంతు కనుక్కున్నాడు, దుర్మార్గుడు! మనిషి సహనానికీకూడా కొంత పరిమితంటూ ఉంటుంది. ఇదంతా బయటపెట్టి, దీనిలో ఎవరెంతవరకూ బాధ్యులో నిరూపించి, కడిగి ఒదిలిపెడదా మని అనేకసార్లు అనిపించేది. కాని ధైర్యం చాలేది కాదు. ఇప్పుడెవళ్లని సాధిస్తాడు? అవతలివాళ్లని అంతే ఉసురుపెడితే - వాళ్లు చివరికి చచ్చేది ఇలాటి బలవంతపు చావే. ఇంకా నయం అదృష్టవంతుడు కుళ్లికుళ్లి చావాల్సింది!"

అతనిగుండెబరువు చాలావరకు తగ్గి మెదలకండా కూర్చున్నాడు. నేనూ, వెంకటేశ్వర్లంటే నా కెప్పుడూ కోపంలేదన్నట్లు శాంతంగా కూర్చున్నాను. కొంచెంసేపు గడిచాక - శంకరశాస్త్రినుంచి నన్ను రక్షించావు - అన్నట్లు అతనివైపొకసారి చూచి—"వెళ్లి వస్తా"నని బయటపడ్డాను.

ఇంతకూ వాళ్లిద్దరూ చేసిన దుర్మార్గమేమిటో తెలుసుకుందా మని మీకు ఆసక్తి కలిగి ఉండవచ్చు. వెంకటేశ్వర్లు మాటలన్నీ విన్న మీ కెంత తెలుసో, నాకూ అంతే తెలుసు. ఆ విషయం బయటపడిందంటే మనమంతా అతని "స్నేహితులం" అవతామని అతనిభయం. అసలిప్పుడు ఆరహస్యం అతనిదగ్గరనుంచి మనం గ్రహించే అవకాశంకూడా లేదు. వెంకటేశ్వర్లు ఈమధ్య ఇక్కడెక్కడా కనిపించటం లేదు.

అతని ఆచూకీ ఇంకా బయటపడవలసి వుంది. శంకరశాస్త్రిచావునుగురించి అనుమానమంతా ఇప్పుడు వెంకటేశ్వర్లుపైన ఉంది. నిజం ఒప్పుకోవలసివస్తే, ఈ విషయం నామనస్సుకెంతో స్వస్థత చేకూర్చింది.

రైతు తీర్పు

(15 వ పేజి తరువాయి)

'వున్నారండి'— అన్నారు యిద్దరు రైతులు...

'నీ కూతుర్ని యితనికొడుకుకు యిచ్చి పెళ్ళి చేసి ఆ బంగారమంతా వీళ్ళిద్దరికీ యిచ్చెయ్యండి'— అని పెద్దరైతు తీర్పు చెప్పాడు...

ఆ తీర్పు విన్న అలెగ్జాండరు ఆశ్చర్యపడి... 'ఏమయ్యా! యిలా చేశావే!...మా రాజ్యంలో యిలా చేయరు... భూమిలో చిక్కిన ధనమంతా ప్రభుత్వపరం కావలసిందేను...అంతగా వాళ్ళిద్దరూ ఆ ధనం కొరకు తగాదా పెంచితే, వాళ్లిద్దరికీ ఉరిశిక్ష యిచ్చేస్తాము'— అన్నాడు...

రైతు ఆశ్చర్యపడి 'ఏమండీ మీ దేశంలో వర్షాలు కురుస్తాయా?'— అన్నాడు.

'ఓ! ఎందుకు లేదు?' అన్నాడు అలెగ్జాండరు...

'మీ దేశంలో పచ్చిగడ్డి మేసే పశువులున్నాయా?' అన్నాడు రైతు...

'ఎన్నో వున్నాయి'— అన్నాడు అలెగ్జాండరు...

'అందుకే వర్షాలు కురుస్తున్నాయి'— అన్నాడు రైతు.

అలెగ్జాండరుకు అర్థం కాలేదు. అలాగే రైతు వైపు కొంతసేపు చూచి— 'నీ మాటలు నాకర్థం కాలేదు'— అన్నాడు.

'భగవంతుడు వర్షాలు ఆ నోరు లేని పశువులు మీ దేశంలో వుండబట్టి, వాటి మేతకొరకు వర్షాలు కురిపిస్తున్నాడు గాని, రక్తం ప్రవాహాలు కట్టించి, అన్యాయం చలామణీ చేసే మీ కొరకు గాదు'— అన్నాడు రైతు...

అలెగ్జాండరు యిదంతా బాగా అర్థం చేసుకోని, భారతదేశంలో అప్పటి న్యాయపాలన, ఆ రైతు తీర్పు, ఎంతో మెచ్చుకున్నాడు.

(అనుకరణ

'జాలరి - భూతం'

(14-వ పేజీ తరువాయి)

గోడ ఒకటి ఫళ్లుమని పగిలి దోవ యిచ్చింది. దాంట్లోంచి ఎర్రటిగడ్డంగల ఒక పెద్దమనిషి ఇవతలికి వచ్చి - "చేపలూ, మీవిధిని మీరు నిర్వర్తిస్తున్నారా?" అని అడిగాడు.

"ఔను, సంతోషంగా చేస్తున్నాము." అని చేపలు బదులు చెప్పాయి. అపుడా పెద్దమనిషి ఆ కుండని కిందికి నెట్టేశాడు. ఆ చేపలు అగ్గిలో పడి బుగ్గి అయాయి; మాడి మసి అయిగాయి. అంతట ఆ వింతమనిషి గోడలోకి చేరాడు. మళ్లీ ఆ గోడ యథాప్రకారంగానే తయారయింది.

"ఇదంతా ఏదో చాలా తమాషాగా వుంది. దీని రహస్యం తెలుసుకుని తీరాలి." అని అనుకున్నాడు రాజు.

చప్పున రమ్మని జాలరికి చెప్పి పంపాడు. వాడొచ్చాడు.

"జాలరీ, నీవెక్కడ చేపలు పట్టావు"? అని రాజు ప్రశ్నించాడు.

"నగరానికి ప్రక్కగా కొంతదూరం పోతే కనబడే మూడుకొండల సమీపాన వున్న నీలపునీళ్ల సముద్రంలో పట్టాను." అని అన్నాడు చేపలవాడు.

"మంత్రీ, నీ వా ప్రదేశం ఎరుగుదువా?"

"ప్రభూ, ఆ ప్రాంతానికి ఎన్నోసార్లు వెళ్లాను గాని, నా కెపుడూ ఆ పర్వతాలు కానీ, సముద్రం గానీ కనిపించలేదు."

"ఐతే, ఆ ప్రదేశం ఎంతదూరంలో ఉంది?"

"మూడుగంటల ప్రయాణం" అన్నాడుజాలరి.

"ఐతే చూస్తాం, పదండి." అని రాజు, తన అంగరక్షకుల్ని కొందర్నీ, ఆ చేపలవాణ్ణీకూడా తీసుకుని ప్రయాణం కట్టాడు. ఆ ప్రదేశానికి వెళ్లి, నీలపునీళ్ల సముద్రం చూచేప్పటికి జాలరి తెచ్చియిచ్చిన చేపల్లాంటి చేపలు చాలా కనిపించాయి.

"మీ రంతా ఇక్కడే ఆగండి. నేను వెళ్లి సంగతంతా తెలుసుకుని వస్తా నని చెప్పి నెమ్మదిగా కొండమీది కెక్కాడు రాజు.

కొండ కవతలప్రక్క ఓ పెద్ద రాజభవనము కనబడ్డది. ఆభవనం ఎర్రరాళ్లతో కట్టబడివుంది. అక్కడికి వెళ్లి రాజు తలుపు తట్టాడు. అతీ గతీ లేదు. పిలిచి చూచాడు. మనిషిపత్తా లేదు. తలుపులు తోసుకుని లోపలికి వెళ్లాడు. లోపలంతా చిత్రవిచిత్ర అలంకారాలతో శోభించే గదులెన్నో ఉన్నాయి. కాని ఎక్కడా మనిషివాసనే లేదు. ఆ బంగళాచుట్టూ తోట ఉంది. ఆ తోట రకరకాల పూలతో పండ్లతో అందముగా ఉంది. ఈ గదులన్నీ దాటుకుని రాజు హాల్లోకి వచ్చాడు. అతడి కక్కడ కొన్నిమాటలు వినిపించాయి: "నాకు బతకాలనే ఆశ ఎంతమాత్రం లేదు. ఎంత త్వరగా చనిపోతే అంత మేలు" అని ఎవరో విచారంతో భారంగా వాపోతున్నారు. రాజు ఇంకా ముందుకు సాగిపోయాడు. అక్కడ ఒక యువకుడు కూర్చునివున్నాడు. అతడివద్దకు వెళ్లాడు రాజు. "ప్రభూ, నీవు రాజువని తెలుసును. ఐనా నిన్ను మర్యాద చేయడానికి నిలుచుకోలేను" అని ఆ యువకుడు చెప్తూ, తన కాళ్లమీద గుడ్డను తొలగించి చూపించాడు. అతని పాదాలు తెల్లరాళ్లతోచేయబడినబొమ్మ పాదాలల్లేవున్నాయి.

"ఇదేమిటి! నీ కీ రాతికాళ్లేమిటి? వంటకై పొయిమీద పెట్టిన చేపలు మాట్లాడ్డ మేమిటి? ఆ ఎర్రగడ్డంమనిషి గోడలోంచి రావడ మేమిటి? ఇదంతా ఏదో గందరగోళంగా వుంది. ఈ వివరాలంతా చెప్పు" అని రాజు ఆశ్చర్యంతో రాతికాళ్లవాణ్ణడిగాడు.

యువకుడిలా చెప్పడం ప్రారంభించాడు:

"ఈ మూడుకొండలూ ఈ రంగు సముద్రమూ వున్నచోట పూర్వం ఓపెద్ద రాచనగరుఉండేది. ఆ నగరానికి ప్రభువు మాతండ్రి. మా నాయనగారు మరణించిన తరువాత ఆ రాజ్యం నాకు వచ్చింది. నేనొక చక్కని చుక్కను పెండ్లాడాను. కాని కృతఘ్నురాలు ఆమెమాత్రం నన్ను ప్రేమించలేదు; ఒక సేవకుణ్ణి ప్రేమించింది. ఇది సహించలేక నే నాసేవకుణ్ణి చంపేయాలనుకున్నాను. అతణ్ణి మొత్తాను. కాని అతడు చావలేదు. ఈ చర్యవలన నాపెళ్లానికి చాలా కోపం వచ్చింది. ఆ దేవో మంత్రాలో ఏవో నాలుగు మాటలు పలికింది. వెంటనే ఆశ్చర్యంగా నా కాళ్లు రాళ్లుగా మారిపోయాయి. నా నగరమంతా ఈ మూడు కొండలుగా సముద్రంగా మారిపోయింది. నా ప్రజ లందరూ చేపలుగా మారిపోయారు. అల్లదిగో, ఆ కనబడే ఉద్యానవనంలో ఒక చిన్న చలవరాతి మేడ ఉంది. ఆ మేడలో ఆ సేవకుడున్నాడు. అతడింకా బతికే వున్నాడు. కాని కదల్లేడు, మెదల్లేడు. ప్రతిరోజూ నా పెళ్లాం వాడిదగ్గరకు పోయి వస్తూంటుంది."-ఈవిధంగా తన కథ సాంతంగా వినిపించాడు.

ఆ సంగతి విన్న రాజుకి, రాజకుమారుడికి తగిన సహాయం చేయాలని సంకల్పం కలిగింది. వెంటనే పాలరాతి మేడ కెళ్లాడు. అక్కడ సేవకుడు మంచంలో పడివున్నాడు శవాకారంగా. రాజు అతడిదగ్గర కెళ్లి కిక్కురు మనకుండా గొంతు నులిమేసి వాణ్ణి చంపేశాడు. ఆ సేవకుడి స్థానంలో రాజే స్వయంగా - అచ్చు సేవకుడిలాగా వాడి వేషంతో పడుకుని ఉండినాడు.

కొంతసేపటికి రాణి వచ్చింది. సేవకుడే అనుకుని రాజుని పరామర్శించింది-"ఓ నా సేవకుడా, సుఖంగా వున్నావా"? అని.

"నా కెలా నిద్రపడుతుంది? ఈ రాజకుమారుడు అస్తమానం అరుస్తూ, ఏడుస్తూ గోల పెట్తూంటే నా కెక్కడి నిద్ర? తన కాళ్లు రాయిలా అయిపోయాయని ఒకటే గోల, పాడుగోల!" అన్నాడు రాజు.

ఆ మాటలు విని రాణి ఆ రాజకుమారుడి - తన భర్త - వద్దకు వెళ్లి కొన్ని నీళ్లు అతడిమీద చిలకరించింది. అతనికాళ్లు మామూలుస్థితిని పొందాయి. అతడిప్పుడు నడవగలడు.

మళ్లీ వచ్చి "సౌఖ్యంగా వున్నావా?" అని రాణీ అడిగింది.

"రాత్రిపూట ఆ సముద్రంలో చేపలుగా మారిఉన్న జను లంతా అరుస్తూంటే నా కెలా నిద్రపట్తుంది?" అని జవా బిచ్చాడు రాజు.

అప్పుడు రాణీ ఎలాగయినా తన ప్రేమపాత్రుడైన ఆ సేవకుడికి సౌకర్యం కల్పించాలనే తలంపుతో ఆ సముద్రం వద్దకు వెళ్లి, ఏవో నాలుగుముక్కలు చెప్పింది. అంతటితో ఆమూడు కొండలూ, ఆ సముద్రమూ యథాప్రకారం పెద్ద నగరం అయిపోయింది. చేపలన్నీ, ప్రజలయాయి.

అలా చేసి ఆమె తిరిగి రాజుదగ్గిరికి వచ్చి "నీ సుఖానికి అడ్డాలైనవాటి నన్నిటినీ తొలగించాను. ఇప్పుడైనా నీకు సుఖం కలిగితే నా కదే పదివేలు" అని అంది.

"రా, నారాణీ, దగ్గిరకు రా! మరీ దగ్గిరికి రా!" అన్నాడు రాజు.

పాపం రాణీకి ఇందులో ఉన్న మోసం తెలియక తన వేలపుకాడే అతడనుకొని దగ్గిరికి వచ్చింది.

అమాంతంగా పైన బడి, ఆమెను అదిమి పట్టి, పీక నొక్కేసి చంపేశాడు రాజు.

అతడప్పుడు రాజకుమారుడివద్దకు వెళ్లి "రాణీ పీడవదలింది. ఆమె ఇక లేదు. నీ నగరం మామూలు స్థితి కొచ్చింది. నీ ప్రజ లంతా మళ్లీ మనుష్యులయ్యారు. అంతా యథాప్రకారం ఐంది. నీ రాజ్యాన్ని నీవిక ఒడిదుడుకులు లేకుండా పాలించుకో!" అని చెప్పి రాజు వెళ్లిపోయాడు.

తన కష్టాలన్నీ గట్టెక్కడానికి ఆ జాలరే కదా కారణం అని, అతడికి చాలా డబ్బు ఇచ్చి గౌరవించాడు. అది మొదలు ఆ చేపలవాడు, భార్యా, బిడ్డలూ సుఖంగా వుంటూ వచ్చారు.

[ఆంగ్లకథ ఆధారంగా]

ప్రజాభిప్రాయం

(8 పేజీ తరువాయి)

ఒక సభ్యుడులేచి, "భూఖామందు అడుగుతూన్న ధరచాలా ఎక్కువ అనీ పంచాయతీ భరించకూడదనీ" తీవ్రంగా వాదించాడు. అంతవరకూ బాగానే ఉంది. కాని మర్నాడునుంచి గ్రామస్థులు తమ తమ సంభాషణలలో," "వెంకయ్యకు,రామయ్యమీది పగ బయలుదేరింది! మొన్నటిదాకా కలిసే ఉండేవారుగా" అనుకొనేవారు. ప్రజాక్షేమసూత్రాల ప్రత్యక్షస్వరూపం వాళ్లకు ఆ రూపంలో కనబడేది.

కాని పల్లీయులకు "మానవస్వభావం" తెలిసినంతగా "చదువుకొన్నోరి" కెవరికీ తెలియదని మాత్రం నాకు విశ్వాసంగా తెలిసివచ్చింది. ప్రజల ననేకమందిని, అనేకస్వభావ స్వరూపాలలో, ప్రత్యక్షజీవితపరిస్థితుల్లో వాళ్లు చూసి తెలుసుకొన్నారు. పట్టణాల "చదువుకొన్నోరికి" వారికి మానవుని విషయంలో తెలిసిన జ్ఞానంలో శతాంశం తెలియదు. "చదువుకొన్నోరికున్నంత"నోరు వాళ్లు బైలుపెట్టరు. అల్లా వాళ్లు బయలుపెట్టేదాకా ఏ సమస్యమీద అయినా నిజమైన ప్రజాభిప్రాయ మేమిటో బైలుపడదు.

గ్రంథ స్వీకారము

రైతుబాబు :

సాంఘిక పద్యకావ్యము. ప్రతులకు రచయితకే వ్రాయునది. డాక్టరు పొందూరి సాంబమూర్తి, రావులపట్టు - ఉంగుటూరు పోస్టు, వయా తాడేపల్లిగూడెం. వెల 1-0-0.

శ్రీజానకీశతకము :

రామదండకము రచయిత ఉపేంద్రము శంకర నారాయణరాజు, బోర్డుహైస్కూల్, మదనపల్లి. వెల లేదు.

విజ్ఞాన సాహిత్యవనం బెజవాడవారి ప్రచురణలు

ప్రేమలేఖలు :

రచన ఉగ్రజీ. అనువాదం శర్మ. వెల 1-0-0.

పరీక్ష :

నవల. జైనేంద్రకుమార్. అనువాదం అయాచిత్. వెల 1-8-0.

నేరస్థులు : వారి స్థితిగతులు :

రచన. ఎ. ఎం. సోమసుందరం. వెల 2-0-0